క్లుప్తంగా

రేపు మట్టి విగ్రహాల పంపిణీ

రాజమహేంద్రవరం రూరల్: వినాయక చవితి సందర్భంగా పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి విగ్రహాలు మాత్రమే వినియోగించాలని సత్య చారిటుబుల్ ట్రస్టీ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఒక ప్రకటనలో కోరింది. ఈ సందర్భంగా శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు, మోరంపూడి సెంటర్, ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న టీ టైమ్ వద్ద మట్టి వినాయక విగ్రహాలను అందజేస్తున్నట్టు తెలిపారు.

నూతన సభ్యత్వాల నమోదు

కడియం: సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్‌లో నూతనంగా సభ్యులుగా చేరేవాళ్లు కడియపులంకలోని అసోసియేషన్ కార్యాలయం వద్ద సంప్రదించాలని పాలకవర్గం అధ్యక్షుడు మల్లు పోలరాజు కోరారు. ఈనెల 6వ తేదీ వరకూ సభ్యత్వ నమోదు జరుగుతుందన్నారు. నర్సరీ రైతులు గమనించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కడియం: సీజనల్ జ్వరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని వైద్య సిబ్బంది సూచించారు. మండలంలోని కడియపుసావరం-1, కడియపులంక-3 పరిధిలో బుధవారం ప్రభుత్వ వైద్యులు వైద్య శిబిరాలు నిర్వహించారు. కడియపుసావరంలో 47 మందిని పరీక్షించగా నలుగురు జ్వరంతో ఉన్నట్లు గుర్తించారు. కడియపులంకలో 51 మందిని పరీక్షించగా 9 మంది జ్వరంతో ఉన్నట్లు గుర్తించారు. వారికి డెంగీ, మలేరియా సంబంధిత రక్తపరీక్షలు కూడా చేసినట్టు వైద్యులు తెలిపారు. శిబిరంలో వైద్యులు ఎస్.నాగసాయిమౌర్య, జీ స్వరూప సేవలందించారు. వైద్య పరీక్షలు చేయడంతో పాటు, అవసరమైన వారికి మందులు అందిస్తారన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన ఉండాలి

రాజమహేంద్రవరం రూరల్: సమాచార హక్కు చట్టంపై అధికారులు అందరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు అన్నారు. స్థానిక ఇన్నీసుపేట అరుణప్యాలెస్ ఫంక్షన్ హాల్లో ఆయన అధ్యక్షతన సహాయవ్యవసాయసంచాలకులు, మండల వ్యవసాయాధికారులు, వ్యవసాయవిస్తరణ అధికారులకు సమాచార హక్కు చట్టం 2005పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు మాట్లాడుతూ 4(1)(బి)సెక్షన్‌పై వివరణ ఇస్తూ తగిన రికార్డ్స్ తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. అధికారులను తమ కార్యాలయంలలో సమాచారహక్కు చట్టం 2005 సెక్షన్4(1)(బి)(16) ప్రకారం బోర్డ్సను పౌరులకు అందుబాటులో ఉండేటట్లు ఏర్పాటు చేయాలని సూచించారు.

మృత్తికా గణపతిం..మనసా స్మరామి!

- పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపయ్యలు సిద్ధం
- అడుగు నుంచి 12 అడుగుల వరకు విగ్రహాల తయారీ

రాజమహేంద్రవరం రూరల్: విఘ్నాలు తొలగించే వినాయకుడి చవితి ఉత్సవాలకు ముస్తాబవుతున్నాడు. ఇప్పటికే పలు చోట్ల మహాగణపతి కొలువయ్యాడు. ఇప్పటి వరకూ పర్యావరణానికి హాని కలిగించే రీతిలో ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారైన బొజ్జ గణపయ్య విగ్రహాలు ఉండేవి. ఈ సారి మాత్రం చాలా వరకు 'ఎకో'దంతులుగా రూపొందుతున్నాయి. పర్యావరణ పరిరక్షణ కోసం ఆలోచించిన పలువురి విగ్రహాల తయారీదారులు ఈ సారి 'మృత్తికా గణపతిం' మనసాస్మరామి అంటున్నారు. స్వచ్ఛమైన బంకమట్టితోనే ఆ లంబోధరుడి ప్రతిమలను అందంగా తీర్చిదిద్దుతున్నారు.

జోరుగా విగ్రహాల తయారీ

జిల్లాలోని పలు చోట్ల మట్టి గణపతి విగ్రహాల తయారీ జోరుగా సాగుతోంది. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో గణపతి విగ్రహాలను తయారు చేసినప్పుడు మెర్క్యూరీ, ఆర్గానిక్‌లెడ్ క్రోమియం, ఆర్గనిక్ తదితర విష పదార్థాలతో కూడిన రసాయనాలను విరివిగా ఉపయోగిస్తున్నారు. అవి నీటిలో కలిసినప్పుడు జలకాలుష్యం ఏర్పడుతుంది. ముఖ్యంగా అలాంటి విగ్రహాలు నిమజ్జనం చేసినప్పుడు నీటిలో కరగదు. దీని వల్ల నీటిలో పెరిగే నాచుమొక్కలు, జలచరాల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోంది. అంతే కాకుండా ప్రజలకు అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని నిపుణులు పేర్కొంటున్నారు.



మట్టి గణపతిల విగ్రహాలు



పంచముఖ వినాయకునికి తుది మెరుగులు దిద్దుతున్న చిత్రకారిణి

మట్టితో చేసిన విగ్రహాలే మేలు

కాలువ, గోదావరి మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలను నీటిలో నిమజ్జనం చేసినప్పుడు అవి త్వరగా కరిగిపోతాయి. నీటిలో ఉండే జలచరాలకు ఎటువంటి హాని ఉండదు. నీటి కాలుష్యం ఉండదు. మట్టి విగ్రహాలతో పర్యావరణానికి కలుగుతున్న మేలును స్వచ్ఛంధ సంస్థలతోపాటు పాఠశాల విద్యార్థులూ తెలియజేస్తున్నారు. దీంతో పాటు మట్టి విగ్రహాలు పంపిణీ చేస్తున్నారు. ఇటీవల జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి వినాయక చవితి వేడుకల్లో మట్టి విగ్రహాలనే వినియోగించాలని ఆదేశాలు జారీ చేశారు.

చిన్న ప్రతిమలను వినయోగిస్తే మేలు

- చిన్న సైజు ప్రతిమలను ఏర్పాటు చేస్తే నిమజ్జనం సమయంలో ఇబ్బందులు తలెత్తవు.
- బంకమట్టితో తయారైన విగ్రహాలను నిమజ్జనం చేస్తే అవి త్వరగా నీటిలో కలసిపోతాయి.
- బంకమట్టి నీటి స్వచ్ఛతను పెంచేందుకు దోహదం చేస్తుంది.
- నిమజ్జనం సమయంలో చిన్న మట్టి విగ్రహాలు నీటిలో కరిగి జలానికి ఎటువంటి నష్టం కలుగజేయదు.
- ఇళ్లలో ప్రతిష్ఠించే చిన్నచిన్న విగ్రహాలతో పాటు మండపాల్లో ప్రతిష్టించే భారీ విగ్రహాల వరకు మట్టిగణపతినే ఏర్పాటు చేసుకోవాలి.

ఇలా తయారీ చేస్తున్నారు..

కళాకారులు మొదట వెదురుతో వినాయక ప్రతిమ రూపొందిస్తున్నారు. ఆ తరువాత దానికి గడ్డి చుట్టి, మట్టితో పూర్తిస్థాయి మెరుగులు దిద్దుతారు. సహజ సిద్ధమైన రంగులను అద్ది కాలుష్య రహిత వినాయక విగ్రహాలను తయారు చేస్తున్నారు.

మట్టి గణపతినే పూజిద్దాం



వినాయక చవితికి ఒక ప్రత్యేకత ఉంది. మట్టి గణపతి విగ్రహాలను తీసుకుని వచ్చి ప్రతి ఒక్కరూ పూజలు చేయడం ద్వారా పర్యావరణ పరిరక్షణలో మనం కూడా భాగస్వామ్యంకావాలి. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, తదితర మెటీరియల్‌తో తయారు చేసే విగ్రహాల వల్ల పర్యావరణానికి నష్టం. ఒక్కరూ సామాజిక బాధ్యతగా మట్టి గణపతి విగ్రహాలను మాత్రమే పూజించాలి.

–పి.ప్రశాంతి,జిల్లా కలెక్టర్,తూర్పుగోదావరి

ఏటా అందజేస్తున్నాం..



పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని ఏటా మట్టి విగ్రహాలను ప్రతి ఒక్కరికి సత్య చారిటబుల్ ట్రస్టు తరుపున ఉచితంగా అందజేస్తున్నాం. ట్రుస్టు సభ్యులందరి సహకారంతో పర్యావరణ పరిరక్షణకు కృషిచేస్తున్నాం. ఈ ఏడాది కూడా ఉచితంగా మట్టి ప్రతిమలను పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.

–తమ్మా రవి, సత్యచారిటబుట్ ట్రస్టు చైర్మన్, మోరంపూడి

కుటుంబం అంతా బొమ్మల తయారీలోనే..

మేము మొత్తం ఏడుగురం. రాజస్థానీ నుంచి ఇక్కడ వచ్చి 15 సంవత్సరాలు పైన అయింది. వినాయక చవితికి విగ్రహాలు తయారీ చేసి వాటిని విక్రయిస్తాం. ఈ పనిలో మా కుటుంబం మొత్తం పాల్గొంటుంది. చన్నవి 100 విగ్రహాలు, పెద్దవి 50 విగ్రహాలు తయారు చేశాను.

- హిమ్మత్, రాజస్థానీ కళాకారుడు

జీవకళ ఉట్టి పడేలా..

- బొమ్మలకు జీవం పోస్తున్న రాజస్థానీ కళాకారులు
- ఉపాధి పొందుతున్న 100కు పైగా కుటుంబాలు

సీటీఆర్ఐ: సమస్త జీవరాసులను సృష్టించేది దేవుడు. ఆయన రూపం వర్ణనలో తప్ప నిజంగా తెలియదు. అటువంటి దేవుళ్ల రూపాలకు జీవం పోస్తున్నారు రాజస్థానీ కళాకారులు. ఆకారంలోనూ, రంగులోనూ ఎలాంటి తేడా లేకుండా రాముడైనా, కృష్ణుడైనా, శివుడైనా, లక్ష్మీదేవీ, వినాయుకుడైనా ఇలా ఏ రూపమైనా సరే అవలీలగా జీవకళ ఉట్టిపడేలా విగ్రహాలను తయారు చేస్తున్నారు. ఊరు పొట్ట చేతపట్టుకుని కుటుంబం సహ రాజస్థాన్ నుంచి మన జిల్లాకు చేరుకున్నారు గత 30 ఏళ్లుగా ఇక్కడ జీవనం సాగిస్తున్నారు. జిల్లాలో రాజమహేంద్రవరం కేంద్రంగా లాలాచెరువు, ఆర్టీఓ కార్యాలయం వద్ద వీరు బొమ్మలు తయారు చేస్తున్నారు. స్థలం లీజుకు తీసుకుని అక్కడ షేడ్ వేసుకుని బొమ్మలు తయారీ చేస్తున్నారు. అలాగే బొమ్మూరు, హుకుంపేట వద్ద రోడ్డుపై విగ్రహాలను తయారీ చేస్తున్నారు. సంవత్సరంలో ఆరు నెలలు ఈ విగ్రహాల తయారీలోనూ వారి కుటుంబం అంతా నిమగ్నమై ఉంటుంది. ఈ బొమ్మలను వైట్ సిమెంట్‌తో తయారీ చేస్తున్నారు. గణపతి విగ్రహాలు సైజు బట్టి, డిజైన్ బట్టి రూ.3 వేలు నుంచి రూ.75 వేలు వరకు ధర ఉంది. ఇంటిల్లిపాది బొమ్మల తయారీతో ఉపాధి పొందుతున్నారు.



కొలువైన గణనాథులు

అన్ని రకాల బొమ్మలతో....

వినాయక చవితి వేడుకలు ముగిసిన అనంతరం ఉపాధి కోసం ఇళ్లకు శోభను తీసుకువచ్చే అలంకరణ బొమ్మలు తయారీ చేపడతారు. వినాయక చవితి, దసరా, దీపావళి వంటి సీజనల్‌గా తయారు చేసి బొమ్మలతోపాటు అన్ని రకాల అంటే ఇంటి అలంకరణకు సంబంధించిన బొమ్మలను కూడా తయారు చేసి విక్రయిస్తుంటారు. ఇందులో వినాయక చవితికే అధిక ప్రాధాన్యం ఉంటుంది.

ముంపు ప్రాంతాల ప్రజల పునరావాసానికి అన్ని చర్యలు తీసుకున్నాం

కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ: నగరపాలక సంస్థ పరిధిలో ముంపు ప్రాంతాల ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా, అవసరమైతే వారిని పునరావాస కేంద్రాలకు తరలించి ఆదుకోవడానికి అన్ని చర్యలు తీసుకున్నామని కమిషనర్ కేతన్ గార్గ్ బుధవారం తెలిపారు. రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా నగరంలో తుమ్మలావ, అర్యాపురం, కృష్ణ నగర్, రాజీవ్ నగర్ పాకలు, ఇందిరా సత్యానగర్ పుంత తదితర ప్రాంతాలు ముంపునకు గురయ్యే అవకాశాలున్నందున అక్కడ ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని చందా సత్రం, ఆల్కాట్ గార్డెన్స్ కళ్యాణమండపం, అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులను పునరావాసానికి సిద్ధం చేశామన్నారు. సచివాలయ కార్యదర్శులకు ఘాట్ వద్ద పర్యవేక్షించే విధులను అప్పగించామని, గతంలో సహాయ పునరావాసాలకు నగరపాలక సంస్థ సిబ్బందితో బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రధాన నీటి సరఫరా కేంద్రం, పంపింగ్ కేంద్రాలకు ఇంధనం, అదనపు మోటార్లు అన్ని సిద్ధం చేయాలని, వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ, అవసరమైన చోట్ల అదనపు మోటార్లను పంపింగ్‌కు వినియోగించాలని ఆదేశించామన్నారు. ముంపు ప్రాంతాలలో సమస్యలకు తక్షణ సహాయం అందించడానికి మూడు సత్వర ప్రతిస్పందన బృందాలను నగరపాలక సంస్థ సహాయి ఇంజినీర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో టీములు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అలాగే 24 గంటలు పని చేసేలా కమాండ్ కంట్రోల్ రూంను ఏర్పాటు చేశామని ప్రజలు వరదలకు సంబంధించి తమ సమస్యలను నెం.94940 60060కు ఫోన్ చేసి తెలియజేయాలన్నారు.



కేతన్ గార్గ్,కమిషనర్

ఉత్తమ ఉపాధ్యాయులుగా పలువురి ఎంపిక

కడియం: మండలం పరిధిలోని కడియం, కడియపులంక పాఠశాలల్లో పనిచేస్తున్న ముగ్గురు ఉపాధ్యాయులు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైనట్టు ఎంఈఓలు నాగేశ్వరరావు, మణికుమార్ తెలిపారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు నుంచి బుధవారం ఉత్తర్వులు అందాయన్నారు.

సేవా కార్యక్రమాలు చేస్తూ..

కడియం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టిళ్లపూడి సత్యనారాయణ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారన్నారు. ఈయన 1996 నంబర్ 6న స్కూల్ అసిస్టెంట్‌గా గొల్లప్రోలు మండలం తాటిపర్తి ఉన్నత పాఠశాలలో విధుల్లో చేరారు. ఆయన పని చేసిన ప్రతి పాఠశాలలో మౌలిక వసతుల కల్పన, ఉన్న విద్యా ఫలితాలు, పాఠశాలలను సుందరీకరణ వంటి పనులు చేసి ఉత్తమ ఉపాధ్యాయులుగా నిలిచారు.

అన్నింటా చేదోడుగా ఉంటూ..

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కడియపులంకలో స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న జోళ్ళ సత్యసాయివిజయప్రసాద్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకి ఎంపికయ్యారు. 1995 జూన్ 30లో పి.జగన్నాథపురంలో ఎస్టీటీగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు. ఈయన సేవలను గుర్తించిన జిల్లా విద్యాశాఖ ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక చేశారు.



టిళ్ళపూడి సత్యనారాయణ



జోళ్ళ సత్యసాయి విజయప్రసాద్



సబ్బతి శ్రీనివాసరావు

అభినందనలు

దామిరెడ్డిపల్లి సెకండరీగ్రేడ్ టీచర్‌గా పనిచేస్తున్న సబ్బతి శ్రీనివాసరావు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైనట్టుడీఈవో వాసుదేవరావు నుంచి ఉత్తర్వు అందాయన్నారు. ఈసందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు శ్రీనివాసరావును అభినందించారు.

రాజమహేంద్రవరం నుంచి ఎంపికైన ఉత్తమ ఉపాధ్యాయులు వీరే

కంబాలచెరువు: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా రాజమహేంద్రవరం నుంచి ఏడుగురు ఎంపికయ్యారు. ప్రధానోపాధ్యాయుల విభాగంలో నాగరాజా నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.చక్రధర్, జాంపేట లూథరన్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఎస్.మేరీ పెరల్స్ ఎంపికయ్యారు. స్కూల్ అసిస్టెంట్స్ విభాగంలో ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఏఎల్ నరసింహారావు, శ్రీనివాస రామానుజన్ నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఎ.సూరిబాబు ఎంపికయ్యారు. ఎస్‌జీటీ విభాగంలో సీతంపేట పంతం సత్యనారాయణ నగరపాలక సంస్థ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు బి.చైతన్య కుమార్, సెంట్ జాన్స్ రివర్ డేల్ ఉపాధ్యాయిని టీఎస్ సరోజినీదేవి, గాంధీపురం-2 నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు దాసరి శివసత్యమూర్తి ఎంపికయ్యారు.

వరద బాధితులకు భోజనం ప్యాకెట్ల అందజేత

రాజమహేంద్రవరం రూరల్: లయన్స్ క్లబ్ కొంతమూరు షణ్ముక క్లబ్ ప్రెసిడెంట్ పామర్తి నాగరాజు, క్లబ్ మెంటార్, జోన్ చైర్మన్ అడుసుమిల్లి బాబుసార్ ఆధ్వర్యంలో విజయవాడ వరద బాధితుల సహాయార్థం రూ.10 విలువచేసే భోజన ప్యాకెట్లు అందజేశారు. గళమ్ పత్రిక ఎడిటర్ నాగేశ్వరరావు సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో కొంతమూరు షణ్ముక క్లబ్ ప్రెసిడెంట్ పామర్తి నాగరాజు, జోన్ చైర్మన్ అడుసు మిల్లి బాబుసార్ పదివేల రూపాయలు విలువైన బిస్కెట్లు, వాటర్ బాటిల్స్‌ను జాయింట్ కలెక్టర్ ఎస్.చిన రాముడుకి ఆయన చాంబర్‌లో అందజేశారు. ఈ కార్యక్రమంలో భాస్కర్ రాజు, భాష, వీర్రాజు, లక్ష్మీసాయి తేజ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వాటర్ బాటిళ్ల పంపిణీ

కంబాలచెరువు: విజయవాడ వరద బాధితుల సహాయార్థం రాజమహేంద్రవరం నుంచి పది వేల వాటర్ బాటిళ్లని బుధవారం గోరంట్ల శాంతారావు మెడికల్ సెంటర్ అధినేత డాక్టర్ రవిరామ్‌కిరణ్ గోరంట్ల, డాక్టర్ వైఎస్ గురుప్రసాద్ అందించారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌పి ప్రభాకర్ తదితరులు పాల్గొని వాటర్ బాటిళ్లని విజయవాడ తరలించారు.

ఆవకాలువలో పూడికలు తొలగించండి

జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి



హుకుంపేటలో ఆవకాలువను పరిశీలించి, సూచనలు చేస్తున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం నగరం నుంచి వర్షపు నీరు, మురుగునీరు ప్రవహించే ఆవకాలువ పూడికతీత పనులు పూర్తిస్థాయిలో చేపట్టాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. భారీ వర్షాలు వలన ముంపుకు గురయ్యే హుకుంపేట ప్రాంతాన్ని ఆమె, మండలస్థాయి అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ భారీ వర్షాలు, గోదావరి ఉధృతి వలన హుకుంపేట, బొమ్మూరు పరిసన ప్రాంతాలు మునగకుండా శాశ్వత చర్యలు చేపట్టాలన్నారు. ఆవకాలువ పూడికలతో పాటు, ఆక్రమణలను త్వరితగతిన తొలగించాలని ఆదేశించారు. అలాగే ప్రమాదకరంగా ఉన్న ఆర్అండ్‌బీ కల్వర్టు నిర్మాణం త్వరితగతిన నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీడీవో డి.శ్రీనివాసరావు, ఇన్‌చార్జి తహసీల్దార్ లక్ష్మీ రమ్య, డీఆర్‌డీఏ పీడీ మూర్తి, పంచాయతీ కార్యదర్శి గుంట్రు వెంకటరావు, టీడీపీనేతలు పాల్గొన్నారు.

నగరం జలమయం



జలదిగ్బంధంలో కంబాలచెరువు హైటెక్ బస్టాండ్



వర్షంతో నీట మునిగిన రైల్వే స్టేషన్ రోడ్డు

- ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షం
- నీట మునిగిన తుమ్మలోవ, ఆర్యాపురం తదితర ప్రాంతాల
- లంక గ్రామాల్లో ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలింపు

సీటీఆర్ఐ: నగరంలో బుధవారం ఎడతేరిపి లేకుండా కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. జన జీవనం స్తంభించింది. ఎక్కడికక్కడ రోడ్లపై నీరు నిటిచిపోవడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. వర్షానికి నగరంలోని నల్లా ఛానెల్, తుమ్మలోవ, ఆర్యాపురం, కంబాలచెరువు, దానవాయిపేట, సీతంపేట, తాడితోట, వెంకటేశ్వరనగర్, భాస్కర్ నగర్, కోటిలింగాల పేట, రామదాసు పేట, ఆనంద్‌నగర్, రాజీవ్ గాంధీ కాలనీ, ఇందిరానగర్ తదితర ప్రాంతాలు జలమయమయ్యాయి. రాజమహేంద్రవరం అర్బన్‌లో 78.2 మిల్లీమీటర్లు, రూరల్‌లో 68.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

లంకల్లో ఉన్న వారిని పునరావాస కేంద్రాలకు తరలింపు

గోదావరి నీటి ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో లంక గ్రామాల్లో నివశిస్తున్న మత్స్యకారులను పునరావస కేంద్రాలకు తరలించేందుకు కలెక్టర్ ప్రశాంతి ఆదేశాల మేరకు రెవెన్యూ డిపార్ట్‌మెంట్, వివిధ విభాగాలు సిబ్బంది చర్యలు చేపట్టారు. స్థానిక చందా సత్రంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో వారికి కావాల్సిన ఆహార పదార్థాలు, ఇతర సౌకర్యాలు కల్పించారు. కేతావారి లంక, బ్రిడ్జిలంకకి చెందిన ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. వర్షాలు, వరదలపై ప్రజలను అప్రమత్తం చేయాలని సచివాలయాల్లోని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. రాబోయే రెండు రోజులు కూడా వర్షాలు ఇలా కురుస్తాయని వాతావరణ శాఖ ఇప్పటికే హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో గోదావరి వరద నీటి ప్రవాహం పెరిగే అవకాశముంది. ఈ నేపథ్యంలో నగరంలోని గోదావరి పరివాహక ప్రాంతాలు నీట మునిగే అవకాశం ఉన్నందున నిత్యావసరాలు, కొవ్వొత్తులు, అగ్గి పెట్టెలు, బిస్కట్లు, పాలు తదితర ఆహార పదార్థలు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ప్రజలు పలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బుధవారం నగరంలో పలు ప్రాంతాలలో సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, ఎస్పీ నరసింహ కిషోర్ తదితరులు పలు ప్రాంతాలలో పర్యటించి, ప్రజలను అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



హుకుంపేట ఆవకాలువలో పూడికలు తీస్తున్న సిబ్బంది



నగరంలో పర్యటిస్తున్న సిటీ ఎమ్మెల్యే వాసు, ఎస్పీ నరసింహకిషోర్ తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలో బుధవారం జోరున వర్షం కురవడంతో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్ ప్రాంతం వర్షపునీటితో మునిగింది. అల్కాట్‌తోట ప్రాంతంలో పలువీధులు సైతం నీటమునగడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రైల్వేస్టేషన్‌రోడ్డు నీటమునగడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

ముంపు నేపథ్యంలో పూడిక తీత

రాజమహేంద్రవరం నగరం వర్షంతో నీట మునగడంతో ఆవకాలువ పూడికలను నగరపాలకసంస్థ అధికారులు హుటాహుటిన చర్యలు చేపట్టారు. హుకుంపేట తూర్పురైల్వేస్టేషన్‌రోడ్డులో రాకపోకలను నిలుపుదల చేసి ఆవకాలువలోని గుర్రపుడెక్కను తొలగించే చర్యలు చేపట్టారు.దీంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.